క్లుప్తంగా

పల్లకీ సేవ



వేణమ్మపేటలో పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు

ఆమదాలవలస రూరల్: స్థానిక సత్యసాయి సేవా సమితి, వేణమ్మపేట–అక్కులపేట యువత, భక్తుల ఆధ్వర్యంలో ఆదివారం పల్లకీ ఉత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ యువజన విభాగం వారి ఉగాది పర్తి యాత్ర సామూహిక సాధనాంశాల్లో భాగంగా పల్లకీ సేవ చేపట్టారు. భక్తులకు స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

భాగ్యలక్ష్మికి బంగారు పతకం



గోల్డ్ మెడల్ సాధించిన భాగ్యలక్ష్మి

పాతపట్నం: స్థానిక శాఖా గ్రంథాలయం ఎదురుగా ఉన్న రాజీవ్‌నగర్‌కు చెందిన మల్లిపురం భాగ్యలక్ష్మి జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్ సాధించారు. ఈ విషయాన్ని ఆమె ఆదివారం తెలిపారు. అనంతపురంలో 42 మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. శ్రీకాకుళం జిల్లా నుంచి భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ పోటీల్లో (50+) జావెలిన్ త్రోలో గోల్డ్ మెడల్, షాట్‌పుట్‌లో సిల్వర్ మెడల్, లాంగ్ జంప్‌లో బ్రాంజ్ మెడల్‌ను సాధించారు. ఈమె ప్రస్తుతం టెక్కలి ఉప ఖజానాశాఖ (ఎస్టీఓ) అధికారిగా పనిచేస్తున్నారు. ఆమెకు గోల్డ్ మెడల్ రావడంపై పాతపట్నం, టెక్కలి, శ్రీకాకుళం ఖజానా శాఖ ఉద్యోగులు అభినందనలు తెలియజేశారు.

అభివృద్ధి వైపు అడుగులు వేద్దాం



మాట్లాడుతున్న డీవీఎంసీ మెంబర్ ధనుంజయరావు

ఆమదాలవలస: పంచవృత్తులు, విశ్వబ్రాహ్మణ సంఘాల సభ్యులంతా కలిసి అభివృద్ధి వైపు అడుగులు వేద్దామని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ) మెంబర్ తాళాబత్తుల ధనుంజయరావు అన్నారు. ధనుంజయరావుకు ఈ పదవి దక్కినందుకు పట్టణంలోని మున్సిపల్ పాఠశాల వద్ద విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ధనుంజయరావు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సామాజిక వర్గానికి, స్వర్ణకారుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామన్నారు. విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు లోలుగు విశ్వేశ్వరరావు (శాస్త్రి మాస్టారు), కార్యదర్శి డి. శ్రీనివాసరావు, క్రియాశీలక సభ్యులు మండా రాజేశ్వరరావు, ఓమ్మి భాస్కరరావు, కటకం హరిప్రసాద్, రాజాజీ, టీకె గోపాలకృష్ణ, నిమ్మగడ్డ రామనాగు, మండా శ్రీనివాసరావు, చెవూరి కామేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏఈఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా శ్రీధర్



నరసన్నపేట: స్థానిక వ్యవసాయశాఖ ల్యాబ్‌లో వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ)గా పనిచేస్తున్న గొండు శ్రీధర్ ఏఈఓ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ ఏపీ ఎన్జీఓ కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. శ్రీధర్ ఎన్నిక పట్ల జిల్లాకు చెందిన ఏఈఓలు హర్షం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని కొల్లివలసలో గల డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ గురుకులం విద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్మీడియెట్ ప్రథమ (ఇంగ్లిష్ మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ డి.దేవేంద్రరావు ఆదివారం తెలియజేశారు. దరఖాస్తును మార్చి 6వ తేదీ సాయంత్రంలోగా అందజేయాలన్నారు.

రైస్ మిల్లర్స్ జిల్లా అసోసియేషన్ మెంబర్‌గా త్రినాథరావు

కొత్తూరు: మండలంలోని వెంకటాపురంలో గల శివపార్వతి రైస్ మిల్లు యజమాని జి.త్రినాథరావును రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బోర్డు మెంబర్‌గా ఆదివారం ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక శ్రీకాకుళంలో నిర్వహించారు. త్రినాథరావు ప్రమాణస్వీకారం చేశారు. గతంలో మండల రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధిగా త్రినాథరావు పనిచేశారు.

దోమల నివారణకు చర్యలు

ఆమదాలవలస: పట్టణంలోని 15 వార్డు పాతినివారి వీధిలో దోమల నివారణకు ఆ వార్డు నాయకుల ఆధ్వర్యంలో స్ప్రే చేశారు. వార్డులోని అదే వీధిలోని ప్రధాన రహదారిపై ఉన్న చేతి పంపు గత కొన్నాళ్లుగా పాడై మూలకు చేరడంతో తాగునీటి ఇబ్బందులు పడుతున్నామని ఆ వార్డు వాసులు కోరారు. మున్సిపల్ సిబ్బందితో మరమ్మతులు చేయించారు.

రెవెన్యూ సమస్యలు.. పరిష్కారమయ్యేనా?



బొంతు రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు (ఫైల్)

- 60 శాతానికి పైగా పరిష్కారం కాని సమస్యలు
- తలలు పట్టుకుంటున్న రెవెన్యూ అధికారులు

సారవకోట: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గతేడాది డిసెంబర్‌లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులకు ఏ ఒక్క రెవెన్యూ సమస్య లేకుండా చేయడానికే వీటిని నిర్వహిస్తున్నట్లు కూటమి నాయకులు ప్రకటించారు. రెవెన్యూ అధికారులు మండలాల్లో ఉన్న రెవెన్యూ గ్రామాల్లో గతేడాది డిసెంబర్ నుంచి ఈ ఏడాది జనవరి వరకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభలకు రైతుల నుంచి పెద్దగా స్పందన లేక పోయినప్పటికీ ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం నిర్వహించారు. ఈ సభల్లో నరసన్నపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి 3,158 దరఖాస్తులను రైతులు చేశారు. ఈ దరఖాస్తుల్లో 60 శాతానికి పైగా ఇప్పటికీ పరిష్కారం కాలేదు. తహసీల్దార్ స్థాయిలో పరిష్కరించ గల మ్యూటేషన్లు వంటి చిన్న సమస్యలు మాత్రమే పరిష్కరిస్తున్నారు తప్ప.. ఇతర సమస్యలకు పరిష్కారం లభించడం లేదు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు అలాగే పేరుకుపోయి డాష్ బోర్డుల్లో కన్పిస్తున్నాయి. చిన్న సమస్యల పరిష్కారం తప్ప.. ఒకే ఖాతాలో ఇద్దరి రైతుల పేర్లు ఉండటం, ఒకరి ఖాతాలోని భూమి వేరే వారి ఖాతాలో చేర్చడం తదితర సమస్యల పరిష్కారం తమ చేతుల్లో లేదని స్థానిక రెవెన్యూ అధికారులు చేతులు ఎత్తేస్తున్నారు. చాలా సమస్యలు రెవెన్యూ డివిజన్ అధికారి, జేసీ స్థాయికి వెళ్లి పరిష్కరించాలని, తమ చేతుల్లో ఏమీ లేదని తేల్చేస్తున్నారు. సమస్యలపై దరఖాస్తు చేసుకున్న రైతులు చేసేది ఏమీ లేక కార్యాలయాల చుట్టూ తిరిగి వెళ్తున్నారు. కూటమి ప్రభుత్వం ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా ప్రతీ సమస్యను పరిష్కరిస్తుందని గొప్పగా చెప్పుకున్నారే తప్ప.. కార్యరూపం దాల్చడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో రెవెన్యూ సదస్సులకు వచ్చిన దరఖాస్తుల వివరాలు ఇలా..

మండలం	దరఖాస్తులు	పరిష్కరించగలిగేవి
సారవకోట	1,079	79
నరసన్నపేట	1,030	136
జలుమూరు	633	84
పోలాకి	416	74

సమస్యలు పరిష్కారం కాలేదు



రెవెన్యూ సదస్సులు గ్రామాల్లో నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు. సమస్యలు పరిష్కారవుతాని ఎంతో మంది రైతులు ఎదురు చూస్తున్నారే తప్ప.. పరిష్కారం కాలేదు. కూటమి నాయకులు మాటలు చెప్పడం తప్ప.. పనులు పూర్తి చేసే పరిస్థితి లేదు.

– గెల్లంకి వెంకటరావు, పీఏసీఎస్ మాజీ చైర్మన్, వాండ్రాయి, సారవకోట మండలం

పరిష్కరిస్తున్నాం



రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాం. మా పరిధిలో ఉండే సమస్యలు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరిస్తున్నాం. అవసరమైన వాటిని ఆర్డీఓ, జేసీ స్థాయికి పంపించి వాటి పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

– విజయలక్ష్మి, తహసీల్దార్, సారవకోట

ఏజెన్సీ బంద్ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న

కొత్తూరు: స్పీకర్ చింతకాలయ అయ్యన్నపాత్రుడు 1/70 చట్ట సవరణపై చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఈ నెల 11, 12 తేదీల్లో నిర్వహించనున్న ఏజెన్సీ బంద్‌ను విజయవంతం చేయాలని ఏపీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న కోరారు. కొత్తూరులో ఆదివారం విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల విశాఖపట్నంలో పారిశ్రామికవేత్తలతో నిర్వహించిన సమావేశంలో టూరిజం అభివృద్ధికి 1/70 ఆటంకంగా ఉన్నందున, చట్ట సవరణకు లోతైన అధ్యయనం చేయాలని స్పీకర్ చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. గిరిజనులపై కూటమి ప్రభుత్వ వైఖరి ఏమిటో వెంటనే ప్రకటించాలన్నారు. గిరిజన నేతలు జి.ఎండుయ్య, ఆరిక గణపతి, హేమంత్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

ఆమదాలవలస: నియోజకవర్గ మాజీ సైనిక సంక్షేమ సేవా సంఘం ఎన్నికల ప్రకటనను సైనికుల సంఘం ఫౌండర్ సూర అవతారం ఆదివారం జారీ చేశారు. ఎన్నికల కమిటీ సభ్యులుగా ముగ్గురు మాజీ సైనికులు లెఫ్టినెంట్ కల్నల్, పి.ఎస్.రావు, సుబేదార్ జి.సత్యనారాయణ, సుబేదార్ మేజర్ బి.సంజీవరావును నియమించామన్నారు. మాజీ సైనిక సంఘం అధ్యక్ష (ప్రెసిడెంట్) పదవి ఎన్నికలకు నామినేషన్ దాఖలు చేయడానికి దరఖాస్తు సమర్పించడానికి ఈ నెల 12వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉందన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 15 వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉందని పేర్కొన్నారు. నామినేషన్లను పరిశీలించిన తర్వాత ఎన్నికలను ఈ నెల 25వ తేదీ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. ఎన్నికలు పూర్తయిన తర్వాత అదే రోజు లెక్కింపు చేపట్టి ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఎన్నికలను రైతు బజారు దగ్గర ఉన్న మెహర్ బాబా హాల్‌లో నిర్వహిస్తామన్నారు. ఈ ఎన్నికల్లో సభ్యత్వం తీసుకున్న ఓటర్లు మాత్రమే ఓటు వేయడానికి అర్హులని, ఓటు వేసేటప్పుడు మాజీ సైనికుడి గుర్తింపు కార్డును తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలనుకునేవారు పూర్తి వివరాలకు ఫోన్ 9989530389 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

మద్యం షాపు లాటరీ వాయిదా

పాతపట్నం: శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల రోడ్డులో ఉన్న అంబేడ్కర్ ఆడిటోరియంలో ఈ నెల 10వ తేదీన జరగాల్సిన మద్యం షాపుల లాటరీ వాయిదా పడిందని పాతపట్నం ఎక్సైజ్ సీఐ కె.కృష్ణారావు ఆదివారం తెలిపారు. పాతపట్నం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని పాతపట్నం మండలానికి సంబంధించి శ్రీశైన సామాజిక వర్గానికి కేటాయించిన మద్యం దుకాణానికి ఐదు దరఖాస్తులు అందాయన్నారు. లాటరీ ఎప్పుడు తీస్తారన్న విషయం ఉన్నతాధికారుల సూచనల మేరకు దరఖాస్తుదారులకు తెలియజేస్తామన్నారు.

కల్యాణం.. కమనీయం



సారవకోట మండల కేంద్రంలోని శివరామ పాత్రుని కోనేరు గట్టుపై ఉన్న సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో ఆదివారం వల్లీదేవి సహిత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మూడు రోజుల నుంచి ఆలయ వార్షికోత్సవాలు నిర్వహిస్తున్నట్టు రుత్వికులు వెంకరమణ శాస్త్రి తెలిపారు. ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తులను ఏర్పాటు చేసి కల్యాణం నిర్వహించారు.

- సారవకోట

ఆవిష్కరణ



పాతపట్నం మండలంలోని కొయ్యకొండలో సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ సైనికుడు పల్లి సురేంద్రబాబు ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రపంచంలోనే ఎక్కువ విగ్రహాలు కలిగిన ఏకైక నాయకుడు అంబేడ్కర్ అని అన్నారు. ప్రొఫెసర్ అశోక్ మాట్లాడుతూ ప్రపంచంలోనే గొప్ప మేధావి అంబేడ్కర్ అని కొనియాడారు. జిల్లా అధ్యక్షుడు చల్లా రామారావు, రాష్ట్ర కార్యదర్శి యర్రం సుధీర్, కురమాన సింహాచలం, సి.హెచ్. తిరుపతిరావు, రంగారావు, రామచంద్రుడు, దిలీప్ కుమార్, భాస్కరరావు, భారతి, ప్రేమానందం, కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

- పాతపట్నం

వైభవంగా..



సారవకోట మండలంలోని అలుదు పంచాయతీ మాకివలస గ్రామంలోని రామ మందిరంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. రామమందిర వార్షికోత్సవం ముగింపు పురస్కరించుకుని ఉత్సవ విగ్రహాలను ఆరుబయట ఏర్పాటు చేశారు. పురోహితులు ఉమామహేశ్వర రావు కల్యాణ ఉత్సవం నిర్వహించారు.

- సారవకోట

ముమ్మరంగా..



ఈ చిత్రం ఎల్.ఎన్.పేట మండలంలోని బొత్తాడసింగి ప్రాంతంలో యంత్రం ద్వారా నూర్పుడి చేస్తున్న రైతులు. ఈ ఏడాది రబీలో వేసిన పెసర, మినుము పంటలు చేతికివచ్చాయి. ఖరీఫ్ వరి పంట పొలాల్లో కుప్పలు పెట్టినవాటిని ప్రస్తుతం యంత్రాల ద్వారా నూర్పిడి చేస్తున్నారు. గతేడాది నవంబర్, డిసెంబర్‌లో ఖరీఫ్ వరిచేను కోత కోసి పొలాల్లోనే కుప్పలు పెట్టారు. పొలంలో అపరాల పంటలు వేయటం వలన వెంటనే నూర్పుడి చేయలేక పోయారు. సుమారు వెయ్యి ఎకరాల వరకు నూర్పుడి పనులు ఉన్నాయి. రైతులకు ఇబ్బంది లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

- ఎల్.ఎన్.పేట

అబాకస్ పోటీల్లో ప్రతిభ



పాతపట్నం: యశశ్రీకి జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న నిర్వాహకులు

నరసన్నపేట: రాష్ట్ర స్థాయిలో విజయవాడలో విశ్వం ఎడ్యూటెక్ సంస్థ ఆదివారం నిర్వహించిన అబాకస్ పోటీల్లో నరసన్నపేటకు చెందిన ఇద్దరు బాలికలు సత్తా చాటారు. విద్యార్థి భవన్ స్కూల్‌కు చెందిన గొబ్బక దక్షిత స్టార్ జూనియర్ లెవెల్ (ఒకటో తరగతి) కేటగిరీలో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో నిలిచింది. గీతాంజలి స్కూల్ విద్యార్థిని బోర నవ్య జూనియర్ లెవెల్–1(మూడో తరగతి) కేటగిరీలో మూడో స్థానంలో నిలిచింది. ఈ మేరకు ఆయా స్కూల్ యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 స్కూళ్ల నుంచి 600 మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. చిన్నారులను ఆయా స్కూల్ యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

అబాకస్ పోటీల్లో ప్రథమ స్థానం

పాతపట్నం: రాష్ట్ర స్థాయి అబాకస్ పోటీల్లో పాతపట్నం విక్టరీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని తూలుగు యశశ్రీ ప్రథమ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్ శంకరనారాయణ ఆదివారం తెలిపారు. విజయవాడలో విశ్వం ఎడ్యూటెక్ ఆధ్వర్యంలో అబాకస్ జూనియర్ స్టార్ లెవల్–1లో యశశ్రీ మొదటి స్థానం సాధించింది. నిర్వాహకులు యశశ్రీకి ప్రశంసాపత్రం, జ్ఞాపిక అందజేశారు. విద్యార్థినికి ప్రిన్సిపాల్, పాఠశాల డైరెక్టర్లు అప్పారావు, తారకేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్రేయ మిశ్రాకు నంది అవార్డు..



శ్రేయ మిశ్రాకు స్వర్ణ నంది అవార్డును ప్రదానం చేస్తున్న సినీ నటుడు సుమన్

పాతపట్నం: విశాఖపట్నంలోని ఆంధ్రా విశ్వవిద్యాలయం (ఏయూ) నార్త్ క్యాంపస్‌లో గల గౌతమి బుద్ధ అంబేడ్కర్ ఆడిటోరియంలో లంబోదర కల్చరల్ అకాడమీ జాతీయ స్థాయి సంగీత నృత్యోత్సవాలు ఆదివారం నిర్వహించారు. నృత్య ప్రదర్శనలో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జాతీయ అవార్డు గ్రహీత, దివ్యాంగురాలైన శ్రేయ మిశ్రా కూచిపూడి నృత్యంలో ప్రతిభ కనబరిచింది. ప్లేటుపై ప్రదర్శించిన నృత్యానికి పలువురు ప్రశంసించారు. మిశ్రాకు సినీనటుడు సుమన్ స్వర్ణ నంది అవార్డును ప్రదానం చేశారు. మిశ్రాను నిర్వాహకుడు నక్క అశోక్, నగర డిప్యూటీ మేయర్ శ్రీధర్, కమిటీ సభ్యులు సత్కరించారు.

● ఈ నీరు తాగేదెలా..?

హిరమండలం మేజర్ పంచాయతీలో కుళాయిల ద్వారా ఎర్రటి నీరు వస్తోంది. ఈ కలుషిత నీటిని తాగితే రోగాల బారిన పడతామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

- హిరమండలం



వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మీసాల వెంకట రామకృష్ణ

హిరమండలం: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఇటీవల నియమితులైన పార్టీ మండల అధ్యక్షుడు మీసాల వెంకట రామకృష్ణ అన్నారు. రెండోసారి మండల అధ్యక్షుడిగా నియమించినందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతికి ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు.

60 మీటర్ల విద్యుత్ వైరు చోరీ

సారవకోట: మండల కేంద్రంలోని మండలాధీశ్వర స్వామి ఆలయానికి ఏర్పాటు చేసిన విద్యుత్ వైరు 60 మీటర్లు చోరీకి గురైనట్లు అర్చకుడు లోకనాథం శంకరరావు ఆదివారం తెలిపారు. కొండ పైగల ఈ ఆలయానికి మంచినీటి సదుపాయం కోసం పలువురు దాతలు మోటారు ఏర్పాటు చేశారు. మోటార్‌కు ఏర్పాటు చేసిన 100 మీటర్ల సర్వీసు వైర్‌లో 60 మీటర్లు చోరీకి గురైందన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించామన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



కొత్తూరు బీసీ కాలనీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికులు

కొత్తూరు: మండల కేంద్రంలోని బీసీ కాలనీ, అల్లు వీధితోపాటు పలు వీధుల్లో ఆదివారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. సర్పంచ్ పడాల కృష్ణవేణి పర్యవేక్షించారు. మురుగు కాలువల్లో చెత్తను తీసి గ్రామానికి దూరంగా డంప్ చేశారు.

● అడుగంటినది



ఈ ఏడాది వంశధార నది వేసవికి ముందే అడుగంటి పోయింది. జిల్లా ప్రజలకు సాగు, తాగునీరు అందించే జీవనది అడుగంటి పోవటంతో తీర గ్రామాల ప్రజలు అందోళన చెందుతున్నారు. తీర గ్రామాలైన లక్ష్మీనర్సుపేట, మిరియాపల్లి, దబ్బపాడు, వాడవలస తదితర గ్రామాల ప్రజలు వేసవిలో తాగునీటి కష్టాలు తప్పవని అంటున్నారు. గతం కంటే ఈ ఏడాది ముందుగానే నదిలో నీటి ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది.

– ఎల్.ఎన్.పేట

క్విజ్ పోటీలకు విశేష స్పందన



పొందూరు: విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఎంఈఓ, తదితరులు



కొత్తూరు: విజేతలకు బహుమతులు అందజేస్తున్న గణిత ఉపాధ్యాయ సంఘం నేతలు

పొందూరు: సిక్కోలు గణిత ఉపాధ్యాయ వేదిక ఆధ్వర్యంలో మండలంలోని వావిలపల్లిపేట మోడల్ స్కూల్‌లో 6, 7వ తరగతుల విద్యార్థులకు మండల స్థాయి గణిత క్విజ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ఏపీ మోడల్ స్కూల్, తాడివలస ఉన్నత పాఠశాల, పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని నిర్వాహకులు పూజారి హరిప్రసన్న తెలిపారు. విజేతలకు ఎంఈఓ పట్నాన రాజారావు బహుమతులు అందజేశారు. గురుగుబెల్లి వేణుగోపాలరావు, సప్పటి సత్యరాజు, జీవన్‌బాబు, శాంతారాం పాల్గొన్నారు.

బహుమతుల ప్రదానం..

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన మండల స్థాయి గణిత క్విజ్ పోటీలకు విద్యార్థుల నుంచి అనూహ్యస్పందన లభించింది. జిల్లా గణిత ఉపాధ్యాయ సంఘం ఏర్పాటు చేసి పదేళ్లు పూర్తయిన సందర్భంగా క్విజ్ పోటీలు నిర్వహించినట్లు సంఘం మండల కన్వీనర్ దండు ప్రకాశరావు తెలిపారు. క్విజ్ పోటీలకు మండలంలోని 8 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 6, 7వ తరగతుల నుంచి ఇద్దరు చొప్పున విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీల్లో మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, కడుము జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానాల్లో నిలిచారు. విజేతలకు సంఘం నాయకులు లోతుగెడ్డ గోవర్ధనరావు, భాస్కరరావు, మీనాకుమారి, రామచంద్రరావు, శాంతారావు, గణేష్, కృష్ణ బహుమతులు అందజేశారు.

మానవత్వ విలువలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న సూర రామచంద్రరావు

ఆమదాలవలస: విద్యార్థులు తమ జీవితంలో నైపుణ్య అభివృద్ధితోపాటు మానవత్వ విలువలు కూడా పెంపొందించుకుంటే సమాజంలో ఉన్నత వ్యక్తులుగా రాణిస్తారని శ్రీకాకుళం సత్య సాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు సూర రామచంద్రరావు మాస్టార్ అన్నారు. ఆదివారం ఆమదాలవలస జోనల్ కన్వీనర్ ఎం.జనార్దనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గత రెండు నెలలుగా కంప్యూటర్ శిక్షణ పొందుతున్న విద్యార్థులకు లక్ష్మీనగర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రాష్ట్ర విద్యా జ్యోతి ఇన్‌చార్జి ఎస్.వి.గురు ప్రసాద్, జిల్లా సేవాదళ్ కో ఆర్డినేటర్ పి.నాగేశ్వరరావు మాస్టార్, జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ ఇన్‌చార్జి బోయిన నర్సింహమూర్తి, జిల్లా యూత్ కో ఆర్డినేటర్ శివకుమార్, జిల్లా బాల వికాస్ రిసోర్స్ పర్సన్ చంద్రశేఖర్ మాస్టార్, జిల్లా గ్రామ సేవ ఇన్‌చార్జి ఎం.రవీంద్ర బాబు, కంప్యూటర్ శిక్షణ ట్రైనర్ వీరభద్రరావు, తదితరులు పాల్గొన్నారు.